క్లుప్తంగా

వైఎస్ జగన్‌ను కలిసిన రాజ్యసభ సభ్యుడు మేడా



వైఎస్ జగన్‌కు బొకే అందజేస్తున్న ఎంపీ మేడా రఘునాథరెడ్డి

రాజంపేట : వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో గురువారం రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి భేటి అయ్యారు. తాడేపల్లిలో ఆయన స్వగృహంలో ఎంపీ మేడా మర్యాదపూర్వకంగా కలిసి బొకేను అందజేశారు. ఈ సందర్భంగా వారు పార్టీ పరమైన అంశాలపై చర్చించారు.

ఆకేపాటికి ఆహ్వానం



ఎమ్మెల్యే ఆకేపాటికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఆర్యవైశ్యులు

రాజంపేట రూరల్ : అత్యంత వైభవంగా నిర్వహించే శ్రీమత్స్య కన్యకా పరమేశ్వరీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాలకు హాజరవ్వాల్సిందిగా ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డిని ఆర్యవైశ్యులు ఆహ్వానం పలికారు. మండల పరిధిలోని ఆకేపాటి ఎస్టేట్‌కు గురువారం వచ్చిన ఆలయ దసరా ఉత్సవ కమిటీ, శ్రీ ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు ఆహ్వాన పత్రికను ఆకేపాటికి అందజేసి ఉత్సవాలకు హాజరు కావాల్సిందిగా కోరారు.

ఉపాధ్యాయుడి దాతృత్వం



స్టీల్ పేట్లను అందజేస్తున్న సుబ్బారాయుడు

గాలివీడు : ప్రభుత్వ ఉపాధ్యాయుడు బుక్కపట్నం సుబ్బారాయుడు దాతృత్వాన్ని చాటుకున్నాడు. గురువారం మండలంలోని గాండ్లపల్లి, గాలివీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఆయన తన సొంత నిధులతో 185 భోజనం ప్లేట్లు ఇవ్వడంతోపాటు విందు భోజనాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిలుగా హాజరైన వైస్ ఎంపీపీ మిట్టపల్లి యదుభూషణరెడ్డి, సర్పంచ్ లక్ష్మిదేవమ్మ, విద్యాధికారులు నాగరాజు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పోలీస్ క్వార్టర్స్ స్థలం పరిశీలన

రామాపురం : మండల కేంద్రంలోని ఎంఆర్వో కార్యాలయం సమీపంలో పోలీస్ క్వార్టర్స్‌కు సంబంధించిన స్థలాన్ని గురువారం ఎస్ఐ వెంకట సుధాకర్‌రెడ్డి పరిశీలించారు. మండల పరిధి నల్లగుట్టపల్లె రెవెన్యూ గ్రామ సర్వేనెంబరు 593/1లో 64 సెంట్ల స్థలాన్ని ఆక్రమణకు గురవుతున్నట్లు తెలియడంతో జేసీబీ సహాయంతో పిచ్చిమొక్కలను తొలగించి, స్థలానికి హద్దులను ఏర్పాటు చేయించారు. త్వరలో మంజూరయ్యే నిధులతో పోలీస్‌క్వార్టర్స్ నిర్మాణం చేపడతామని తెలియజేశారు.

అదుపు తప్పి వాహనం బోల్తా



అదుపుతప్పి రోడ్డుపై పడ్డ మినీ లారీ

నందలూరు : కడప – చెన్నై జాతీయ రహదారిలోని ఆల్విన్ మౌంట్ కార్మెల్ స్కూల్ వద్ద గురువారం కడప నుంచి రాజంపేటకు ఎరువు లోడుతో వెళ్తున్న మినీ లారీ వెనుక టైర్ పేలింది. దీంతో వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఆ సమయంలో ఎదురుగా ఏ వాహనం రాకపోవడంతో ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ జిలానీ బాషాకు ఎటువంటి గాయాలు కాలేదు.

స్వచ్ఛతా హీ సేవా

సిద్దవటం : మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయ ఆవరణలో గురువారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని రెవెన్యూ అధికారులు చేపట్టారు. ఈ సందర్భంగా తహసీల్దారు మురాషావలి మాట్లాడుతూ రెవెన్యూ కార్యాలయం ఆవరణలో చెత్తాచెదారాలను, ప్లాస్టిక్ వ్యర్థాలు, పిచ్చి మొక్కలను తొలగించామన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు శుభ్రంగా పెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు మాధవీలత, వీఆర్‌ఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



అక్షయ

రాజంపేట టౌన్ : పట్టణానికి చెందిన డి.అక్షయ రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైంది. ఈ విషయాన్ని ఏకలవ్య మార్షల్ ఆర్ట్స్ మాస్టర్లు రెడ్డి ప్రవీణ్, యు.బాలాజీ గణేష్ గురువారం ఇక్కడి విలేకరులకు తెలిపారు. ఈనెల 26వ తేదీ కడప మున్సిపల్ స్టేడియంలో జరిగిన ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి పోటీల్లో అక్షయ ప్రతిభ కనబరచడంతో అధికారులు ఆమెను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు వారు తెలిపారు.

సమస్యల నిలయంగా కోడూరు బస్టాండ్

- ప్రయాణికులకు సౌకర్యాలు కరువు
- అభివృద్ధి చేసి బస్ డిపో కేటాయించాలని డిమాండ్



రైల్వేకోడూరు బస్టాండ్

రైల్వేకోడూరు అర్బన్ : కోడూరు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు తగిన సౌకర్యాలు లేక ప్రతి రోజు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. 1993లో అప్పటి అప్పటి ప్రభుత్వం పెద్దలు ప్రారంభించారు. కొన్ని ఏళ్లుగా మూతపడి శిథిలావస్థకు చేరినా కొంత కాలానికి బస్సుల రాకపోకలను ఏర్పాటు చేసి అధికారిని నియమించారు. బస్సుల రాకపోకలు సాగుతున్నాయి. కోడూరు, చిట్వేలి, ఓబులవారిపల్లె మండలాల ప్రజలకు ఈ బస్టాండ్ అన్ని విధాలుగా అందుబాటులో ఉంటుంది. ఈ ప్రాంతాల నుంచి ఎక్కువగా తిరుపతి, చెన్నై, హైదరాబాదు, నెల్లూరు, గుంటూరు, విజయవాడ తదిర ప్రాంతాలకు ప్రజలు ప్రతిరోజు వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. దశాబ్దాల కాలంగా కోడూరు బస్ డిపో ఏర్పాటుకు నాయకులు, ప్రజలు విన్నవిస్తూ వస్తున్నారు. ఎన్నికలలో బస్‌డిపో గురించి ప్రస్తావన వచ్చినా ఎన్నికల తరువాత నాయకుల నిర్లక్ష్యం కారణంగా బస్టాండ్ అభివృద్ధికి నోచుకోవడం లేదు. కోడూరు బస్టాండ్ ఇంకెప్పుడు అభివృద్ధి చేస్తారోనంటూ స్థానికులు, ప్రయాణికులు చర్చించుకుంటున్నారు.

బస్టాండ్‌లో నామమాత్రపు సౌకర్యాలు

బస్టాండ్‌ను పునరుద్ధరించినా అక్కడ సౌకర్యాలు నామమాత్రంగా ఉన్నాయి. ఎవరూ పట్టించుకోవడంలేదు. బస్సులు వచ్చి వెళుతున్నప్పటికీ ప్రయాణికుల కోసం పొందుపరచాల్సిన సౌకర్యాలు అంతంతమాత్రంగా ఉన్నాయి. మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి. బస్టాండ్‌లో ప్రయాణికులకు కుర్చీలుగా బస్సులోని సీట్లనే ఏర్పాటు చేశారు. బస్టాండ్ పైకప్పు దెబ్బతినడంతో చిన్నపాటి వర్షానికి స్లాబు ద్వార వర్షపునీరు ప్రయాణికులపై పడుతున్నాయి. బస్టాండ్‌కు ప్రహరీ లేకపోవడంతో రక్షణ కరువైంది. కూటమి ప్రభుత్వంలో చలనం వచ్చి ప్రత్యేకంగా నిధులు కేటాయించి బస్టాండ్‌ను అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

డిపో ఏర్పాటు చేయాలి



రైల్వేకోడూరు ప్రాంత ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా కోడూరు బస్ డిపో ఏర్పాటు కోసం ఎదురు చూస్తూనే ఉన్నాం. నాయకుల నిర్లక్ష్యం కారణంగా బస్టాండ్ అభివృద్ధికి నోచుకోవడంలేదు. ప్రయాణికుల ఇబ్బందులు నాయకులు చూస్తున్నా పట్టించుకోవడంలేదు. ప్రభుత్వం బస్టాండ్‌ను అభివృద్ధి చేయడమే కాక డిపోను ఏర్పాటు చేసి తీరాలి.

-దార్ల రాజశేఖర్, సీపీఐ మండల కార్యదర్శి, రైల్వేకోడూరు

రాత్రి వేళల్లో ప్రయాణికులకు ఇబ్బంది



బస్టాండ్‌కు రక్షణ కరువైంది. ఇప్పటికైనా ప్రభుత్వం చర్యలు తీసుకొని బస్టాండ్‌కు ప్రహరీగోడ నిర్మించి వసతులు కల్పిస్తే బాగుంటుంది. ఊరికి దూరంగా ఉండడం వల్ల రాత్రి వేళల్లో ప్రయాణికులకు ఇబ్బందిగా ఉంది. మరుగుదొడ్లు లేక ప్రయాణికులు ఇక్కట్లు పడుతున్నారు. ప్రజా రవాణా అధికారులు దృష్టి సారించి సమస్యలు పరిష్కరించాలి.

-డమ్ము రఘు, ఉర్లగడ్డపోడు, రైల్వేకోడూరు మండలం

నీట్, ఎంసెట్ ర్యాంకర్లకు స్కాలర్‌షిప్

రామాపురం : 2024 – 25 విద్యా సంవత్సరానికి గాను అన్నమయ్య జిల్లాలోని రాయచోటి, రామాపురం, లక్కిరెడ్డిపల్లె మండలాల్లోని నీట్‌యూజీ, ఎంసెట్ పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన 25 మంది విద్యార్థులకు శ్రీ దర్గా మాతాజీ గంగిశెట్టి రంగనాయకమ్మ ఎడ్యుకేషనల్ సేవా కేంద్రం మెరిట్ స్కాలర్‌షిప్‌ను మంజూరు చేస్తున్నట్లు ట్రస్టు జనరల్ సెక్రటరీ వెంకట సత్యమయ్య స్వామిజీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్రస్టు ఆధ్వర్యంలో ఏడాదికి రూ.10వేలు చొప్పున నాలుగు సంవత్సరాలు అందిస్తామన్నారు. నీట్, ఎంసెట్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 94414 02901కు సంప్రదించాలని కోరారు.

ఉద్యోగ అవకాశాలకు కృషి

రైల్వేకోడూరు అర్బన్ : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి నిరంతరం కృషి చేస్తుందని ప్రిన్సిపల్ భాస్కర్‌రెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రి కళాశాలలో ఉద్యోగ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువకులకు ఉద్యోగ, ఉపాధి లక్ష్యంగా సంస్థ పని చేస్తున్నామన్నారు. ఇక్కడికి 5 కంపెనీలు వచ్చి విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం సంతోషమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఏఐఎస్ఎఫ్ జిల్లా మహాసభలు



మాట్లాడుతున్న మాధవ్

రాజంపేట టౌన్ : ఏఐఎస్ఎఫ్ అన్నమయ్య జిల్లా రెండవ మహాసభలను శుక్రవారం నుంచి మూడు రోజులపాటు రాజంపేట పట్టణంలో నిర్వహించనున్నట్లు ఆ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మాధవ్ తెలిపారు. స్థానిక ఓ ప్రైవేట్ కళాశాలలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం ఉన్నా విద్యార్థులకు వరాలజల్లు కురిపించినట్లే కురిపించి నేతి బీరకాయలో నెయ్యి రుచిచూడమన్న విధంగా మాటలు గుప్పిస్తుండటం పరిపాటిగా మారిందని విమర్శించారు. జిల్లాలో అనేక వసతి గృహాల్లో సరైన సౌకర్యాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. జిల్లాలోని విద్యారంగ సమస్యలపై జిల్లా మహాసభల సందర్భంగా చర్చించి సమస్యల పరిష్కారం కోసం చేపట్టే కార్యాచరణను తెలియజేస్తామన్నారు. ఈ మహాసభలకు ఏఐఎస్ఎఫ్ జాతీయ మాజీ అధ్యక్షులు గుజ్జుల ఈశ్వరయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి జి.వలరాజు ముఖ్య అతిథులుగా పాల్గొంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక : ఏఐఎస్ఎఫ్ మండల శాఖ నూతన కమిటీని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పృథ్వీ, కార్యదర్శిగా సాదిక్, ఉపాధ్యక్షులుగా సతీష్, గోపి, సహాయ కార్యదర్శులుగా దామోదర్, తేజ, శివాజీ, కోశాధికారిగా రెడ్డయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



రాయచోటి అర్బన్: మొక్కలు నాటుతున్న విద్యార్థులు, క్లబ్ సభ్యులు

రాయచోటి అర్బన్ : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని రోటరీ క్లబ్ రాయచోటి అధ్యక్షుడు మనోజ్‌కుమార్ అన్నారు. ప్రపంచ పర్యావరణ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని మాసాపేట జడ్పీ హైస్కూల్ ఆవరణలో రోటరీ క్లబ్ సభ్యులు మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణపైనే మానవ మనుగడ అధారపడి ఉందన్నారు. మొక్కలు నాటడం, కాలుష్యాన్ని నివారించడం తదితర మార్గాల ద్వారా ప్రకృతిని కాపాడుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి శశిశేఖర్, ట్రెజరర్ రాజు, జిల్లా అధికారులు డాక్టర్ రెడ్డెన్న, పి.సురేష్‌కుమార్, అష్రఫ్ అలీ, సభ్యులు రూపేష్, నరసింహ, సుబ్రమణ్యం, పాఠశాల హెచ్‌ఎం శివకుమార్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

పచ్చని చెట్లు ప్రగతి మెట్లు

రాయచోటి టౌన్ : పచ్చని చెట్టు ప్రగతికి మెట్లని రాయచోటి ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ రేఖ అన్నారు. గురువారం భారత ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో కలసి పరిసరాల పరిశుభ్రత, మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ముజినా బీన్ ఖానమ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు ప్రసన్నకుమార్‌లు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదాం

రాయచోటి (జగదాంబసెంటర్) : ప్రతి ఒక్కరూ స్వచ్ఛతను పాటిస్తూ తన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కెనరా బ్యాంక్ మేనేజర్ సతీష్ బాబు పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి పట్టణం పాతరాయచోటిలో కార్మికులకు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని వీబడీఎస్ ఎన్‌జీఓ రాయచోటి సెంటర్ వారు సఫాయి మిత్ర సూక్ష క్యాంపును మున్సిపల్ కమిషనర్ వాసుబాబు సహకారంతో గురువారం నిర్వహించారు. అనంతరం మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు ఆప్రాన్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో వీబడీఎస్ సంస్థ సిబ్బంది సాయిలక్ష్మి, పవన్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామమోహన్, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో దుష్పరిణామాలు

గాలివీడు : బాల్య వివాహాలు చేయడం ద్వార భవిష్యత్తులో అనేక దుష్పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని సీఎస్‌డబ్ల్యూ భారతి తెలిపారు. గాలివీడు బాలికల పాఠశాల, కళాశాలలో గురువారం రెడ్స్ సంస్థ సభ్యులు, పాఠశాల ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భారతి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో చిన్న పిల్లలపై అఘాయిత్యాలు, బాల్య వివాహాలు ఎక్కువగా జరుగుతున్నాయని, అలాగే బాల కార్మికులు పెరుగుతుండటం ఆందోళనకరమన్నారు. ఎక్కడైనా బాల్యవివాహాలు జరుతున్నట్టయితే 1098 నెంబర్‌కి ఫోన్ చేసి తెలియజేయాలన్నారు. అదే విధంగా పాఠశాల విద్యార్థినుల దగ్గర బాల్య వివాహాల నిషేధ ప్రతిజ్ఞ చేయించారు. మన దేశాన్ని బాల్య వివాహ రహిత దేశంగా తీర్చిదిద్దేందుకు తమవంతుగా తోడ్పాటు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.దుర్గేశ్వర రాజు, ఉపాధ్యాయులు రమణయ్య, ఫైరోజ్, నిర్మల, షబానా, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించండి

రాజంపేట టౌన్ : పాఠశాల విద్యారంగంలో నెలకొన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బిల్లా హరిప్రసాద్ డిమాండ్ చేశారు. స్థానిక బోయినపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం యూటీఎఫ్ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి మినహాయించాలని కోరితే కొత్తగా ఉపాధ్యాయులపై ఆన్‌లైన్ పనిభారాన్ని ప్రభుత్వం మోపుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పరీక్షల విధానంలో లోపాలను సవరించాలని డిమాండ్ చేశారు. పాఠశాలల నిర్వహణకు గ్రాంట్లు మంజూరు చేయాలని, నెలవారి పదోన్నతులు కల్పించాలని, ప్లస్ టు పాఠశాలల్లో పీజీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల నిర్వహించిన పని సర్దుబాటు వల్ల ఇంకా గందరగోళం కొనసాగుతోందన్నారు. ప్రభుత్వం చిత్తశుద్ధితో సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు డి.చెంగల్‌రాజు, పి.వెంకటసుబ్బయ్య, జి.నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతో హెచ్ఐవీని నివారించవచ్చు

రాయచోటి టౌన్ : హెచ్ఐవీ నుంచి ప్రతి ఒక్కరూ తమను తాము కాపాడుకోవాలని అర్బన్ సీఐ చంద్రశేఖర్ తెలిపారు. గురువారం రాయచోటి అర్బన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో పీసీఎస్ఎస్ ప్రాజెక్టు ఆఫీసర్ స్వాతి ఆధ్వర్యంలో హెచ్ఐవీ/ఎయిడ్స్ వ్యాధి నివారణపై పోలీసులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ మహమ్మారి జీవితాలనే నాశనం చేస్తుందని తెలిపారు. అలాంటి మహమ్మారికి దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం పీసీఎస్ఎస్ ప్రాజెక్టు ఆఫీసర్ మాట్లాడుతూ హెచ్ఐవీ సోకిన వారికి ఎక్కువగా టీబీ వచ్చే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. అలాగే రోగ నిరోధక శక్తి తగ్గడం, తద్వారా ఆరోగ్యం క్షీణిస్తుందన్నారు. పోషక విలువలు లేని ఆహారం తీసుకోకపోవడంతో టీబీ తీవ్రత పెరుగుతుందని చెప్పారు. ఏఆర్‌టీ (ఆర్ట్) మందులు వాడటం వలన వారి జీవితకాలం పెంచుకోవచ్చుని తెలిపారు.

ఉత్కంఠగా సాగుతున్న ఎస్‌జీఎఫ్ క్రీడలు



ఆసక్తికరంగా సాగుతున్న హై జంప్ పోటీలు



విద్యార్థులను అభినందిస్తున్న పంజం



చిట్వేలి: జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు



పెనగలూరు: జిల్లాస్థాయికి ఎంపికైన విద్యార్థులు

రాయచోటి టౌన్ : ఎస్‌జీఎఫ్ నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు ఉత్కంఠగా సాగాయి. రాయచోటి మాసాపేట జెడ్పీహెచ్ఎస్ మైదానంలో గత మూడు రోజులుగా స్కూల్ గేమ్స్ నిర్వహిస్తున్నారు. ఈ ఆటల పోటీలలో గురువారం నియోజకవర్గ క్రీడల కో–ఆర్డినేటర్ ఎ.జగదీశ్వరయ్య ఆధ్వర్యంలో ఈ ఆటల పోటీలు నిర్వహించారు. మూడవ రోజు అండర్–14, అండర్–17, విభాగాలలో బాలుర, బాలికల వివిధ విభాగాల్లో పరుగు పందెం పోటీలు నిర్వహించారు. అలాగే లాంగ్ జంప్, హై జంప్, షాట్‌పుట్, డిస్క్ త్రో, జావెలిన్ వంటి క్రీడా పోటీలు జరిపారు. ప్రతిభ కనబరిచిన వారిని జిల్లా పోటీలకు ఎంపిక చేశారు.

జిల్లా జట్టులో సుండుపల్లె విద్యార్థినులు

సుండుపల్లె : ఉమ్మడి కడప జిల్లా ఎస్‌జీఎఫ్ హ్యాండ్‌బాల్ పోటీలు గురువారం గండి గురుకుల పాఠశాలలో జరిగాయి. అందులో భాగంగా ఉమ్మడి కడప జిల్లా జట్టుకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సుండుపల్లె విద్యార్థులను అండర్–17లో వాణి, అండర్–14 విభాగానికి గగన, నవ, అల్ఫీషా, హఫీషాలు ఎన్నికయ్యారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఐదు మంది విద్యార్థినులు ఎంపిక కావడానికి కృషి చేసిన పీడీలు రవీంద్రరాజు, రాధారాణిలను ప్రధానోపాధ్యాయులు జయన్న, ఉపాధ్యాయులు అభినందించారు.

స్కూల్ గేమ్స్‌లో ప్రతిభ

రైల్వేకోడూరు అర్బన్ : ఓబులవారిపల్లి సంజీవపురంలో జరిగిన నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ అండర్–17 అథ్లెట్, చెస్ గేమ్స్‌లో డాల్ఫిన్ డేల్ స్కూల్ విద్యార్థులు 7 పతకాలు సాధించి విజేతలుగా నిలిచారు. గురువారం విద్యార్థులను కరస్పాండెంట్ పంజం సుకుమార్‌రెడ్డి అభినందించారు.

జిల్లాస్థాయి పోటీలకు చిట్వేలి విద్యార్థులు

చిట్వేలి : స్టేట్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నియోజకవర్గస్థాయి పోటీలలో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎనిమిది మంది జిల్లాస్థాయికి ఎంపికై నట్లు ప్రధానోపాధ్యాయుడు పురుషోత్తం రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖోఖో అండర్–14, అండర్–17 బాలికల విభాగంలో బి.నందినీ, వైష్ణవి, హర్షితలు, బాలుర విభాగంలో వివేక్, అవినాష్‌లు, అథ్లెటిక్స్‌లో 400 మీటర్ల రన్నింగ్, లాంగ్ జంప్ అండర్–14 బాలికల విభాగంలో దీక్ష, ట్రిపుల్ జంప్, లాంగ్ జంప్ అండర్–17 బాలికల విభాగంలో హర్షిత, నవితలు జిల్లాస్థాయికి ఎంపికయ్యారన్నారు.

జిల్లాస్థాయికి చక్రంపేట విద్యార్థులు

పెనగలూరు : స్కూల్ గేమ్స్‌లో చక్రంపేట విద్యార్థులు ఈనెల 25వ తేదిన కోడూరులో జరిగిన అథ్లెటిక్స్ గేమ్స్‌లలో చక్రంపేట విద్యార్థులు తమ ప్రతిభ చాటారని ఆ పాఠశాల ప్రధనోపాధ్యాయుడు గోపాలకృష్ణ తెలిపారు. ఈనెల 28న జిల్లాస్థాయిలో జరిగే ఆటల పోటీలలో పాల్గొంటారని చెప్పారు. నియోజకవర్గ స్థాయిలో అండర్–17 విభాగంలో విద్యార్థులు సానియా డిస్కస్ త్రో, షాట్‌పుట్‌లలో ప్రథమ స్థానం, వేణుతేజ షాట్‌పుట్‌లో ద్వితీయ స్థానం, తరుణ్ రాజు 800 మీటర్లు, 400 మీటర్ల పరుగు పందెంలో తృతీయస్థానాల్లో నిలిచారన్నారు. జూనియర్స్‌లో సర్వజ్ఞ డిస్కస్ త్రోలో ద్వితీయ స్థానం, కవిత తృతీయ స్థానం సాధించారన్నారు. జిల్లాస్థాయికి ఎంపికైన విద్యార్థులకు చక్రంపేట స్కూల్‌లో మెమెంటోలు ఇచ్చి వారిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పుల్లంపేట : మండల కేంద్రంలోని ఏపీ ఆదర్శపాఠశాలలో గురువారం జిల్లాస్థాయి క్రీడా పోటీలు అండర్–19 క్రికెట్, సాఫ్ట్ బాల్, బేస్ బాల్ ఎంపికలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఈఓ చక్రాధర్ రాజు, కడప ఎస్‌జీఎస్ అండర్–19 సెక్రటరీ శారదల ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ జరిగింది. అనంతరం గెలుపొందిన బాలబాలికలు జిల్లాస్థాయికి ఎంపిక చేశారు.

దుకాణాదారులు సీసీ కెమెరాలు అమర్చుకోవాలి

ఒంటిమిట్ట(సిద్దవటం): మండల కేంద్రంలోని దుకాణాదారులు వారి దుకాణాలలో సీసీ కెమెరాలను అమర్చుకోవాలని ఒంటిమిట్ట సీఐ కృష్ణంరాజు నాయక్ కోరారు. స్థానిక పోలీసులు స్టేషన్‌లో గురువారం ఒంటిమిట్ట బస్టాండు ఆవరణలో ఉన్న దుకాణాదారులతో సీఐ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో ముందుజాగ్రత్త చర్యగా సీసీ కెమెరాను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఒకవేళ దుకాణాల్లో చోరీ జరిగిన సీసీ కెమెరాల సాయంతో నిందితులను పట్టుకునే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటుచేసుకొని పోలీసుశాఖకు సహకరించాలని సీఐ తెలియజేశారు.

రైతులకు నష్ట పరిహారం అందిస్తాం

లక్కిరెడ్డిపల్లె : లక్కిరెడ్డిపల్లి మండలాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తామని టీడీపీ నాయకులు మండిపల్లి లక్ష్మీప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని అనంతపురం గ్రామం ఈడిగపల్లిలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మాట్లాడుతూ మండలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించామన్నారు. కరువు పరిస్థితి నెలకొన్న లక్కిరెడ్డిపల్లి మండలంలోని రైతులకు మంత్రి రాంప్రసాద్‌రెడ్డి సహకారంతో పంటనష్ట పరిహారం అందేలా చూస్తామన్నారు. రైతులకు ప్రత్యామ్నాయ పంటల విత్తనాలు అందించాలని వ్యవసాయ అధికారులకు కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, మదన్ మోహన్, హరీఫ్, కాంట్రాక్టర్ రాజు, పాపయ్య, చంద్ర, వెంకటేష్, భాస్కర్ రెడ్డి, రెడ్డి శేఖర్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు. కాగా అంతకు ముందు అనంతపురం గంగమ్మను ఆయన స్థానిక టీడీపీ నాయకులతో కలిసి దర్శించుకున్నారు.

వన విహారి పనుల పరిశీలన

ఒంటిమిట్ట(సిద్దవటం): మండల పరిధిలోని కుడమలూరులోని సోమశిల వెనుక జలాల సమీపంలో వన విహారి పనులను గురువారం ఫారెస్టు రేంజ్ అధికారిణి ప్రణీతాభాయ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె అక్కడ పనిచేస్తున్న సిబ్బందికి సలహాలు, సూచనలు తెలియజేశారు. అనంతరం ఫారెస్టు రేంజ్ అధికారిణి మాట్లాడుతూ వన విహారి పనులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం రూ.55 లక్షలు కేటాయించిందని ఆమె తెలిపారు.

యామల రాజు కుటుంబానికి అండగా ఉంటాం



కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న కొరముట్ల

రైల్వేకోడూరు అర్బన్ : ఎస్.కొత్తపల్లి వైస్ సర్పంచ్ యామల రాజు కుటుంబానికి అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు గురువారం తెలిపారు. దశదిన కర్మ కాండకు ఆయన హాజరై కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా యామల రాజు పార్టీకి అండగా ఉన్నారన్నారు. పార్టీ ఏ కార్యక్రమం తలపెట్టినా ఎంతో క్రియాశీలంగా వ్యవహరించేవారని చెప్పారు. ఆయనను కోల్పోవడం తీరనిలోటని అన్నారు. కుటుంబానికి పార్టీ తరపునే కాకుండా, సొంతంగా కూడా అన్ని విధాల అదుకుంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్లను పూర్తి చేయించండి

సుండుపల్లె : జగనన్న కాలనీలో ఇళ్లను లబ్ధిదారులు నిర్మించుకునేలా చొరవ తీసుకోవాలని ఎంపీడీఓ రామచంద్ర సంబంధిత అధికారులకు ఆదేశించారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మన ఇల్లు – మన గౌరవంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జగనన్న ఇళ్లను మొదలుపెట్టి ఇంకా పూర్తి చేయాలని లబ్ధిదారులకు అవగాహన కల్పించి నిర్మాణాలు పూర్తి చేసేకునేలా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం హౌసింగ్ ఏఈ నాగరాజు నాయక్ మాట్లాడుతూ మండలంలో 406 ఇళ్లు బేస్‌మెంట్, 151 రూఫ్, 224 రూఫ్ క్యాస్ట్ దశల్లో ఉన్నాయన్నారు. డిసెంబర్ చివరి కల్లా ఇంటి పనులను పూర్తి చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ సురేష్ బాబు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాస్ రెడ్డి, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సచివాలయ మోటివేషన్ టీమ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్‌పై చర్యలు తీసుకోండి

రామాపురం : అక్రమ మైనింగ్ పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ రాయచోటి నియోజకవర్గం కార్యదర్శి శ్రీనివాసులు పేర్కొన్నారు.

గురువారం మండల పరిధిలోని గోపగుడిపల్లె గ్రామ పరిధిలోని శ్రీనిధి స్టోన్ క్రషర్స్ అక్రమ మైనింగ్ పాల్పడుతుందని, నిబంధనలకు విరుద్ధంగా పేలుడు పదార్థాలను ఉపయోగించి కొండలు, గుట్టలను కొల్లగొడుతూ కోట్లు విలువ చేసే సహజ సంపదను దోచుకుంటున్నారని ఆరోపించారు. మూడు గ్రామాల ప్రజలను, జీవాలను, అడవిలో నివసించే పక్షులు, జంతువులు పేలుడు పదార్థాలతో, కలుషితమైన నీరు తాగడంతో మరణిస్తున్నాయన్నారు. మానవాళికి ఇబ్బందిని కలిగించే సంస్థ మైనింగ్ అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన చేపడుతుందని హెచ్చరించారు. ఆయనతో పాటు సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

30న చలో కలెక్టరేట్

రాజంపేట రూరల్ : నాన్ పర్మినెంట్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 30న నిర్వహింప తలపెట్టిన చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేసుకుందామని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్ కోరారు. స్థానిక మన్నూరులోని జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద చలో కలెక్టరేట్ కరపత్రాలను గురువారం సీఐటీయూ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ గతంలోనే టీడీపీ ప్రభుత్వం జీఓ 151ను రద్దు చేయాలన్నారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని కోరారు. ఉద్యోగులకు సంక్షేమ పథకాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ముట్టడి కార్మికులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పీవీ రమణ, ఉపాధ్యక్షురాలు డి.లక్ష్మిదేవి, కొండయ్య, గంగయ్య, భారతి, సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.